ఆంధ్రజ్యోతి ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 4 జులై 2025



మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం

గోదావరిలోకి భారీగా వరద నీరు

- ఎగువ నుంచి 94,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- బ్యారేజీలోని 14 గేట్లు ఎత్తి దిగువకు 102,400 క్యూసెక్కుల నీళ్లు విడుదల

6

దొరతనంపై రణకేతనం

నైజాం నిరంకుశత్వంపై ఎగిసిన రగల్‌జెండా దొడ్డి కొమురయ్య



- వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాటం 6
- ఊరేగింపులో వస్తుండగా దేశ్‌ముఖ్ గూండాల కాల్పులకు బలి
- కొమురయ్య మరణంతో ఎగిసిన సాయుధ పోరాటం
- నేడు కడవెండిలో దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి

భూమి కోసం.. భుక్తి కోసం.. బానిస బతుకుల నుంచి విముక్తి కోసం.. పోరుసల్పిన వీరుడు దొడ్డి కొమురయ్య. విస్నూర్ ప్రాంతంలో దేశ్‌ముఖ్ అనుచరుల ఆగడాలకు వ్యతిరేకంగా ఉద్యమించి, వారి తుపాకి తూటాలకు నేల కొరిగాడు. దేవరుప్పుల మండలంలోని కడవెండి వాసి అయిన కొమురయ్య వీర మరణంతో తెలంగాణ ప్రాంతమంతా ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. నైజాం నిరంకుశత్వాన్ని కూల్చే దాకా కొనసాగాయి. ఈ రోజుతో (జూలై 4) కొమురయ్య త్యాగానికి 79 ఏళ్లు పూర్తవుతున్నాయి. దొరతనంపై రణకేతనం ఎగురవేసిన ఆ వీరుడికి నివాళులర్పించే సందర్భమిది...

- ఆంధ్రజ్యోతి, దేవరుప్పుల

కొండంత ఉత్కంఠ



- ఇటీవలి పరిణామాలు, నేపథ్యాలపై 16 పేజీల నివేదిక సమర్పణ
- ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చినట్లుగా సమాచారం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని 'బొంగు' వ్యాఖ్యలపై ఫిర్యాదు
- 5లోగా వివరణ ఇవ్వాలని గతంలోనే క్రమశిక్షణ సంఘం నోటీసులు
- రేపటితో ముగియనున్న గడువు..
- కొండా దంపతులు మీనాక్షిని కలవటంపై రాజకీయాల్లో ఉత్కంఠ
- అధిష్ఠానం నిర్ణయం కోసం వేచిచూస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిసిన కొండా దంపతులు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లు కాంగ్రెస్‌లో విభేదాలు మరోసారి హీటెక్కాయి. తనపై ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీపై కొండా దంపతులు అధిష్ఠానానికి ఫిర్యాదు చేయటం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షినటరాజన్‌ను గురువారం మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావులు కలవటం హట్‌టాపిక్‌గా మారింది. ఉమ్మడి జిల్లాలోని 11మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీ, మేయర్, ప్రభుత్వ సలహాదారుడు, ఇంచార్జీ మంత్రిపై పలు ఫిర్యాదులతో కూడిన 16 పేజీల నివేదికను మీనాక్షినటరాజన్‌కు అందించినట్లు తెలిసింది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని వాడిన బొంగు వాఖ్యల వీడియోతో సహ ఫిర్యాదు చేశారు. అలాగే కొండా సుస్మిత ఇన్‌స్టాలో పోస్టు చేసిన వ్యాఖ్యలపై కూడా కొండా దంపతులు వివరణ ఇచ్చినట్లుగా సమాచారం.

క్రమశిక్షణ సంఘం గడువు

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలపై మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేసిన వాఖ్యలపై క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి ఇచ్చిన షోకాజ్ నోటీసులకు శనివారం (5వ తేదీ) వరకు వివరణ ఇవ్వాల్సి ఉంది. జూన్ 19వ తేదీన వరంగల్ పోచమ్మమైదాన్‌లో రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలపై అనుచిత వాఖ్యలు చేశారు. దీనిపై 21వ తేదీన ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ తీవ్రంగా ఖండించారు. 22వ తేదీన ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వ రాజు సారయ్య తదితరులు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో పాటు క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవికి ఫిర్యాదు చేశారు.

అయినప్పటికీ ఒకరిపై మరొకరు పరస్పర ఆరోపణలు, విమర్శల దాడిని కొనసాగించారు. అయితే సొంత జిల్లాలోని నేతలతో విభేదాలపై 28వ తేదీన కొండా మురళి క్రమశిక్షణ సంఘానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో తనకు ఉన్న బలం, తనకు ఎవరెవరితో ఎందుకు విభేదాలు ఉన్నాయో ఆరు పేజీల నివేదికతో క్రమశిక్షణ సంఘానికి అందించారు. ఈ క్రమంలో జూలై 5వ తేదీలోగా ఎమ్మెల్యేపై చేసిన వాఖ్యలకు వివరణ ఇవ్వాలని కొండా మురళికి క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై వివరణ ఇచ్చేందుకు కొండా దంపతులు సిద్ధమవుతున్నట్లుగా సమాచారం. ఇదిలా వుండగా, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జికి 16పేజీల నివేదిక ఇవ్వటంతో క్రమశిక్షణ సంఘానికి కూడా ఇదే నివేదికను సమర్పించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ నివేదిక ఆధారంగా క్రమశిక్షణ సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది పార్టీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

చిట్టక్క పోస్టు రచ్చ రచ్చ

కొండా దంపతుల రాజకీయ వారసురాలు కొండా సుస్మిత (చిట్టక్క) చేసిన సోషల్‌మీడియా పోస్టు రాజకీయాల్లో రచ్చరచ్చగా మారింది. మే 31వ తేదీన పరకాల స్థానం నుంచి తానే అభ్యర్థినంటూ సుస్మిత తన ఇన్‌స్టాలో ప్రొఫైల్ ట్యాగ్ చేసుకున్నారు. ఇప్పటికే పరకాల ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ సంఘం కొండా మురళికి షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలో సుస్మిత చేసిన పోస్టు అగ్నికి ఆజ్యం పోసినట్లైందనే చర్చ జరుగుతోంది. దీనిపైనే కొండా దంపతులు మీనాక్షి నటరాజన్‌కు వివరణ కూడా ఇచ్చినట్లుగా సమాచారం.

ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జితో భేటీ

ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావులు గురువారం భేటీ కావటం చర్చనీయాంశంగా మారింది. మీనాక్షికి 16పేజీల నివేదిక ఇవ్వటంతో ఆ నివేదికలో ఏముందో అనేది రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే సభకు సంబంధించి జనసమీకరణపై మాట్లాడామని కొండా మురళి చెబుతున్నప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై పలు ఆరోపణలతో కూడిన నివేదిక ఇచ్చినట్లుగా సమాచారం. తన ప్రమేయం లేకుండానే తన నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి ఎమ్మెల్యేలతో కలిసి పోస్టింగులు ఇప్పించటం, అభివృద్ధి పనుల్లో పాల్గొనటం చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లుగా తెలిసింది. అలాగే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మీడియాలో 'బొంగు' అనే పదాన్ని వాడిన వీడియోను కూడా మీనాక్షి నటరాజన్‌కు చూపించినట్లుగా సమాచారం.

నేను బీసీ వర్గాల ప్రతినిధిని..

- పోటా, టాడా కేసులకే భయపడలేదు..
- కావాలనే నన్ను రెచ్చగొడుతున్నారు..
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

6



ఉగ్రప్రభ త్వరితమాత అలంకరణలో అమ్మవారు

8వ రోజుకు చేరిన భద్రకాళి శాకంబరీ వేడుకలు

వరంగల్ కల్చరల్ జూలై 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ వేడుకలు గురువారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యపూజ అనంతరం అష్టమికి ఆది దేవత శంకరుడు దశమహా విద్యల్లో కాళీక్రమంను అనుసరించి ఉదయం ఉగ్రప్రభ.. జ్ఞానశక్తిని త్వరితమాత గాను అలంకరించి పూజారాధన చేశారు. అమ్మవారి విభూతి అయిన ఈ ఉగ్రపభ మాతకు ప్రత్యంగిరా అనే నామం కూడా ఉంది. ఈ అమ్మవారు భక్తులను అనుగ్రహించి అభయమిస్తుందని అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. కాగా, పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు

- క్షేత్రస్థాయిలో పరిశీలించి మాస్టర్ ప్లాన్‌పై నివేదిక సమర్పించాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్

ములుగు/తాడ్వాయి జూలై 3 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లకోసారి జరిగే మేడారం మహాజాతరకు పక్కా ప్రణాళికలతో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామంలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గద్దెల పరిసరాలను, క్యూ లైన్లు, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, కన్నెపెల్లి సారలమ్మగుడి, చిలకలగుట్ట పరిసరాలు జిల్లా కలెక్టర్ దివాకర, సీఎస్ సలహాదారు గోవిందహరితో కలిసి పరిశీలించారు. అనంతరం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తదనంతరం ఐటీడీఏ అతిథి గృహంలోని సమావేశ మందిరంలో మహాజాతర అభివృద్ధిపనులపై సంబంధిత అధికారులుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాస్తు శిల్పి రాజశేఖర్ మేడారం మాస్టర్ ప్లాన్‌ను స్లైడ్ షో ద్వారా పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ స్లైడ్ షోలో జంపన్నవాగు అభివృద్ధి పనులు, పలు వంతెనల ఏర్పాటు, అధునాతన కూడళ్ల ఏర్పాటు, రోడ్డు విస్తరణ పనులు, దేవస్థానం చుట్టూ అభివృద్ధి, భక్తుల కోసం విశాలమైన క్యూలైన్ల ఏర్పాటు, పార్కింగ్ స్థలాలు, భక్తుల వసతి, పూజారుల వసతి, గిరిజన సంఘాల వసతి, స్నాన ఘట్టాలు, అన్నదాన సత్రాలు, ప్రసాదాల కౌంటర్ల ఏర్పాటు, గద్దెలు, పరిసరాలు ముఖ ద్వారాలు రాతి కట్టడాలతో నిర్మించేలా చేసిన డిజైన్‌లను చూపించారు. అనంతరం శైలజారామయ్యర్ మాట్లాడుతూ 2026 మహా జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉన్నత సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. 100 ఏళ్లకు పైగా నిలిచి ఉండేలా శాశ్వత నిర్మాణాలు చేపడతా మన్నారు. మేడారం అభివృద్ధికి పూజారులు, దేవాదాయశాఖ, గిరిజనశాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి, వారికి సులువైన దర్శనం అయ్యేలా చూడాలన్నారు. తల్లుల దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు భంగం కలగకుండా ఆధ్యాత్మికత పెంపొందేలా అభివృద్ధి చేపడతామని అన్నారు. గిరిజనులు, పూజారులకు ఏమైనా సందేహాలు ఉంటే తెలియజేయాలన్నారు. అభివృద్ధి పనులకు ఆరు నెలల సమయం ఉందన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగేలా శాశ్వత పనులకు ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేడారం అభివృద్ధి జరగాలంటే భూసేకరణ ప్రధానమన్నారు. మేడారం గిరిజనులు, పూజారులు భూసేకరణకు అడ్డు పడకుండా సహకరించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంలో ఏమైన సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దివాకర ద్వార మీ డిమాండ్లు ప్రభుత్వానికి తెలియపరచాలన్నారు. మాస్టర్ ప్లాన్‌ను వాస్తు శిల్పి అద్భుతంగా రూపొందించారని అభినందించారు.



మేడారం పరిసరాలను పరిశీలిస్తున్న శైలజారామయ్యర్



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి..

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

వరంగల్ కలెక్టరేట్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను చెల్లించాలని కోరుతూ కార్మికులు గురువారం వరంగల్ కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు బైరబోయిన సరోజన యాదవ్ మాట్లాడుతూ గత ఐదు నెలల బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వమే కోడిగుడ్లు, గ్యాస్ పొయ్యి అందించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలనే పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ సత్య శారదకు అందజేశారు. ధర్నా కార్యక్రమంలో ఎస్.వనజ, ఎన్.చంద్రకళ, స్వర్ణలత, శారద, సంధ్య, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని కోడలు.. గుండెపోటుతో మామ..

ఒకే కుటుంబంలో ఇద్దరి మృతి.. అవుతాపురంలో విషాదం



ఝాన్సీ(ఫైల్)

పెద్దవంగర, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని అవుతాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. వేముల సంతోష్-వేముల ఝాన్సీ 2011లో వివాహం జరిగింది. వారికి కుమారుడు అఖిల్ తేజ, కుమార్తె అభిదామాని ఉన్నారు. సంతోష్ పెద్దవంగర మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం (ఎంఆర్సీ)లో సీఆర్పీగా, ఝాన్సీ తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. ఝాన్సీ పని చేస్తున్న విద్యసంస్థలో ఒకరు ఆమెను మందలించారు. దీంతో మానసికంగా కుంగిపోయిన ఝాన్సీ (35) గురువారం ఇంటివద్దనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, రెండు రోజుల కిందట విద్యా సంస్థలో ఒకరు మందలించారని తీవ్ర మనస్థాపం చెందింది. పాఠశాలకు ఇక వెళ్లనని భర్తకు చెప్పి ఇంటి వద్దనే ఉంటున్నది. గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఝాన్సీ ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుంది. కోడలి మరణవార్త తెలియడంతో గత కొద్ది రోజులుగా గుండెనొప్పితో బాధపడుతున్న వేముల లక్ష్మయ్య మామ గుండెపోటుతో మృతి చెందాడు. గంటల వ్యవధిలోనే ఒకే ఇంట్లో కోడలు, మామ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లక్ష్మయ్యకు భార్య సరోజన కుమారులు ప్రకాష్, సంతోష్ ఉన్నారు. ఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై క్రాంతికిరణ్ వివరణ కొరగా.. ఘటన స్థలాన్ని పరిశీలించామని, ఫిర్యాదు అందిన వెంటనే పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామన్నారు.

ప్రాణం తీసిన పోలీసు భయం



రమేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న అమ్మమ్మ విశాల

చల్వాయిలో ఉరివేసుకొని నిరుపేద యువకుడి బలవన్మరణం

- 'ఇందిరమ్మ' ఇల్లు రాకపోవడంతో వాట్సాప్‌లో పోస్టింగ్‌లు
- ప్రభుత్వానికి వ్యతిరేక పోస్టులు పెడుతున్నాడని పోలీసుల జోక్యం
- సెల్‌ఫోన్ స్వాధీనం.. స్టేషన్‌కు రావాలని ఆదేశం
- కేసు పెడతారేమోననే భయంతో ఆత్మహత్య
- రాస్తారోకో చేసిన బంధువులు, బీఆర్ఎస్ శ్రేణులు
- వాట్సాప్‌లో వేధించిన నలుగురిపై కేసు నమోదు 6

తనకు అన్ని అర్హతలు ఉన్నా 'ఇందిరమ్మ' ఇల్లు రాలేదని ఓ యువకుడు గ్రామ వాట్సాప్ గ్రూపులో పెట్టిన పోస్టు.. అతడి ప్రాణాలనే బలిగొన్నది. అటు అధికార పార్టీ నాయకులు, ఇటు పోలీసులు బెదిరింపులకు దిగడంతో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయిలో చోటుచేసుకుంది. పోలీసుల భయంతో చుక్క రమేష్(29) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాంగ్రెస్ నాయకులు, పోలీసుల కారణంగానే రమేష్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, గ్రామస్తులు ఆరోపించారు. మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంపై నిలదీసిన రమేష్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే పొట్టనపెట్టుకుందని బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాగా, వాట్సాప్‌లో అనుచిత వ్యాఖ్యలతో మానసికంగా వేధించి రమేష్ ఆత్మహత్యకు కారణమైన చల్వాయికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ములుగు డీఎస్పీ రవీందర్ తెలిపారు. కాగా, రమేష్ అంత్యక్రియలు గురువారం రాత్రి చల్వాయిలో ముగిశాయి.

- ఆంధ్రజ్యోతి, గోవిందరావుపేట


కడవెండిలోని దొడ్డి కొమురయ్య స్మారకస్తూపం


దొరతనంపై రణకేతనం

- నైజాం నిరంకుశత్వంపై ఎగిసిన రగల్‌జెండా దొడ్డి కొమురయ్య
- వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాటం
- ఊరేగింపులో వస్తుండగా దేశ్‌ముఖ్ గూండాల కాల్పులకు బలి
- కొమురయ్య మరణంతో రగిలిన సాయుధ పోరాటం
- నేడు కడవెండిలో ఆయన 79వ వర్ధంతి

దేవరుప్పుల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం.. భుక్తికోసం.. బానిస బంధాల విముక్తి కోసం.. వెట్టిచాకిరి నిర్మూలన కోసం నడుం బిగించి తెలంగాణ గడ్డపై నేలకొరిగిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య. నైజాం సర్కార్ దేశ్‌ముఖ్‌ల కుట్రలతో చిందిన కొమురయ్య రక్తంతో తెలంగాణ రక్త సిక్తమైంది. బాంచెన్ దొర అంటూ దొర పెత్తనంలో నలిగిన వాళ్లను బందూకులు చేతబట్టి పోరాడే దిశగా నడిపించిన ధీరుడు దొడ్డి కొమురయ్య. రజాకార్లు, దేశ్‌ముఖ్‌ల చర్యలను నిలదీస్తూ వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కొమురయ్యను దేశ్‌ముఖ్‌ల గుండాలు కాల్చి చంపి నేటికి(జూలై 4)79 ఏళ్లు పూర్తవుతున్నాయి.

తూటాలకు ఎదురొడ్డి..

విస్నూర్ ప్రాంత గ్రామాలతో పాటు కడవెండిలో దేశ్‌ముఖ్ అనుచరుల ఆగడాలకు వ్యతిరేకంగా 1946 జూలై 3న ఉద్యమకారులతో గ్రామస్థులు సమావేశమయ్యారు. జూలై 4న విస్నూర్ దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి చర్యలకు నిరసనగా కడవెండి ప్రజలు అస్నాల రాజన్న ఇంటి ముందు నుంచి ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు వస్తున్న సమయంలో దక్షిణం వైపు ఉన్న ఇంట్లో నుంచి దేశ్‌ముఖ్ గుండాలు తూటాల వర్షం కురిపించారు. ఊరేగింపులో ముందు వరుసలో ఉన్న దొడ్డి కొమురయ్య, దొడ్డి మల్లయ్యలకు తూటాలు తగిలాయి. కొమురయ్య పొట్టలోకి ఎక్కువ తూటాలు దూసుకు పోవటంతో రాత్రి పది గంటల సమయంలో నేలకొరిగి అమరుడయ్యాడు. కొమురయ్య సోదరుడు దొడ్డి మల్లయ్య ప్రాణాపాయస్థితి నుంచి బయట పడ్డాడు.


దొడ్డి కొమురయ్య (ఊహా చిత్రం)

దొరపై తిరబడి..

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో 1928లో దొడ్డి గట్టమ్మ, కొండయ్యల దంపతులకు కొమురయ్య జన్మించాడు. కొమురయ్యకు 16వ ఏటా 1944లో కొమురమ్మతో వివాహం జరిగింది. పాలకుర్తి మండలం విస్నూర్ కేంద్రంగా 60గ్రామాలను దేశ్‌ముఖ్ రాపాక వెంకట రాంచంద్రారెడ్డి, ఆయన భార్య జానమ్మ దొరసాని, కుమారుడు బాబుదొర ప్రజలతో వెట్టిచాకిరి చేయించుకుంటూ పీడించేవారు. 1943లో ఆంధ్ర మహాసభలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నారు. కడవెండికి చెందిన నల్ల నర్సింహులు, దొడ్డి మల్లయ్య, దావిద్‌రెడ్డి, వడ్డెనర్సయ్య, నల్ల కొండయ్య, మచ్చ రామయ్య, జంపాల లింగయ్య, పంతం లచ్చయ్య, పాముకుంట్ల ముత్తిలింగం, మాశెట్టి రాంచెంద్రయ్య, ఎర్రంరెడ్డి రామకృష్టారెడ్డి, పైండ్ల యాదగిరి తదితరులు నైజాం సర్కారుకు వ్యతిరేకంగా ఉద్యమానికి ఈ ప్రాంతం నుంచి సహకరించారు. 1946లో నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ పోరాటం ప్రారంభమైంది. గ్రామరక్షక దళాల పేరుతో నాడు గుత్పల సంఘాలను ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసుకున్నారు.

ఎగిసిన ఉద్యమం..

కొమురయ్య వీర మరణంతో తెలంగాణ ప్రాంత మంతా ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రక్తాన్ని చిందించి నేలకొరిగిన తొలి అమర వీరుడిగా కొమురయ్య పేరు, ఊరు చరిత్ర పుటల్లో నిలిచి పోయింది. కొమురయ్య అమరుడైన నాటినుంచి నేటి వరకు కడవెండి గ్రామంలో ఆయన స్మారక స్థూపం వద్ద వర్ధంతి సభలను విప్లవ, కమ్యూనిస్టు పార్టీలు నిర్వహిస్తూనే ఉన్నాయి. 50వ వర్ధంతి సభను సీపీఐ ఆధ్వర్యంలో 1996లో పెద్ద ఎత్తున నిర్వహించారు. దొడ్డి కొమురయ్య స్మారక భవనం నిర్మిస్తామని సీపీఐ హామీ ఇచ్చి నెరవేర్చింది. ఆయన పేరిట స్మారక భవనం నిర్మించుకోగా పలు కార్యక్రమాలకు ఉపయోగంలోకి వచ్చింది.

నేడు కడవెండిలో వర్ధంతి సభ

సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కడవెండిలో నిర్వహించే కొమురయ్య 79వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి జీడీ ఎల్లయ్య కోరారు. ఉదయం 11గంటలకు సభ ప్రారంభమవుతుందని కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, రాష్ట్ర సమితీ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్. రాజారెడ్డిలు హాజరవుతారని వెల్లడించారు.


మీడియాతో మాట్లాడుతున్న కొండా మురళి-సురేఖ దంపతులు

నేను బీసీ వర్గాల ప్రతినిధిని..

- పోటా, టాడా కేసులకే భయపడలేదు..
- కావాలనే నన్ను రెచ్చగొడుతున్నారు..
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

వరంగల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'నేను ఎవరికీ భయపడ.. పోటా, టాడా కేసులకే భయపడలేదు.. నేనే క్రమశిక్షణ సంఘం పర్యవేక్షణలో ఉన్నా.. కావాలనే నన్ను కొందరు రెచ్చగొడుతున్నారు.. 44 ఏళ్లగా నా ఎపిసోడ్ నడుస్తూనే ఉంది.. పని చేసేవారిపైనే విమర్శలు ఉంటాయి' అని మాజీ ఎమ్మెల్సీ, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళీధర్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గురువారం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావులు కలిసి 16 పేజీల నివేదికను అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఎవరి గురించి తాను కామెంట్ చేయనని, భయపడుతూ పోతే తనపై 23 కేసులు పెట్టకపోయేవాళ్లు అని మురళీధర్‌రావు పేర్కొన్నారు. మొదటిసారి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్‌ని కలిశాను.. హైదరబాద్‌లో శుక్రవారం జరిగే సభ గురించి మాట్లాడాం.. వరంగల్ నుంచి ఎంతమందిని తరలించాలో చర్చించామని తెలిపారు. కాంగ్రెస్‌ను బతికించటం.. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయటం, మరో పదేళ్లు రేవంత్‌రెడ్డిని సీఎంగా కొనసాగేలా చూడటమే తన ముందున్న లక్ష్యాలని చెప్పారు.

బీసీల ప్రతినిధిగానే కొనసాగుతానని, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు పూర్తి మద్దతుగా ఉన్నామని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని గెలిపించటం.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలను గెలిపించటం మా బాధ్యత.. నేను బీసీ కార్డుపైనే బతుకుతున్నాను.. ఎలాంటి గ్రూపు రాజకీయాలతో సంబంధం లేదు.. అని మురళి స్పష్టం చేశారు.

ఇక తమ కూతురు సుస్మితపటేల్ సోషల్ మీడియాలో చేసిన పోస్టులతో తనకు సంబంధం లేదని, ఒక్కొక్కరి ఆలోచనలు ఒక్కోలా ఉంటాయని, ఆమె ఏం అనుకుంటుందో తమకు తెలియదని మురళి పేర్కొన్నారు. కాగా, తమ కూతురు పరకాల నుంచి పోటీ చేస్తానని చెప్పటంలో తప్పు లేదని మంత్రి కొండా సురేఖ అన్నారు. తను పార్టీ టికెట్ ఆశిస్తుందని, పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా.. దానికి కట్టుబడి ఉంటాం... అని తెలిపారు.

దివ్య దక్షిణ యాత్రకు ప్రత్యేక రైలు

జనగామ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రలకు వెళ్లే వారి కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకొచ్చిందని ఐఆర్‌సీటీసీ టూరిజం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పీవీ వెంకటేశ్ అన్నారు. జనగామ రైల్వే స్టేషన్‌లో గురువారం ఐఆర్‌సీటీసీ టూరిజం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. దివ్య దక్షిణ యాత్ర జ్యోతిర్లింగం, తిరువణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండం, తిరుచ్చి, తంజవూరులకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును హైదరాబాద్ నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు. జూలై 19 నుంచి జూలై 26 వరకు ప్రయాణం ఉంటుందని ఈ యాత్ర సికింద్రాబాద్, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడురు మీదిగా రేణిగుంట వెళ్తుందన్నారు. అక్కడి నుంచి ఆలయాలకు ఉచితంగా తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఒక్కొకరికి సాధారణ టికెట్ ధర రూ. 14,100, 3ఏసీ రూ.22,300, 2ఏసీ 29,200 ఉంటుందన్నారు. ప్రతీరైలులో 718 మంది ప్రయాణికులు ఉంటారని, ప్రతీ 70 మందికి ఇద్దరు కోఆర్డినేటర్లు, కోచ్‌కి ఒక సెక్యూరిటీ గార్డ్ అందుబాటులో ఉంటూ సౌకర్యాలను సమకుర్చుస్తారని తెలిపారు. సీసీ కెమెరాలతో భద్రత, హోటళ్లు, భోజనం, వాటర్ బాటిల్స్ కూడా ఉచితంగా ఇస్తామన్నారు. ఇతర వివరాలకు 9701360701, 9281030711, 9281030712 నంబర్లను సంప్రదించగలరని తెలిపారు. అనంతరం తీర్థయాత్రలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. టూరిజం మానిటర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్

ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం

నర్సంపేట టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఓ ఆర్టీసీ డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురైన ఘటన గురువారం నర్సంపేట నుంచి వరంగల్‌కు వెళ్తున్న బస్సులో జరిగింది. సెల్‌ఫోన్ చూస్తూ, మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని ట్రాఫిక్ సిబ్బంది, పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా కొంత మంది డ్రైవర్ల తీరు మారడం లేదు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం క్షేమం అనే భరోసాతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను కాదని ఆర్టీసీని ఆశ్రయిస్తే.. కొంతమంది డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ఆర్టీసీపై నమ్మకం పోతున్నది. గురువారం ఉదయం 10 గంటల వరకు నర్సంపేట డిపోకు చెందిన టీఎస్ 03 యూబీ 8600 నెంబర్ గల బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. ఇదే సమయంలో బస్సు డ్రైవర్ తన సెల్‌ఫోన్‌లో 20 నిమిషాల పాటు మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.


సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడుపుతున్న డ్రైవర్

గోదావరిలోకి భారీగా వరద నీరు

- ఎగువ నుంచి 94,500 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో
- బ్యారేజీలోని 14 గేట్లు ఎత్తి దిగువకు 1,02,400 క్యూసెక్కుల నీటి విడుదల

కన్నాయిగూడెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్కసాగర్ ప్రాజెక్టు వద్ద గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల నుంచి ప్రవహిస్తున్న ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుంచి వరద నీరు భారీగా వచ్చి గోదావరిలో చేరింది. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 94,500 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండడంతో తుపాకులగూడెం బ్యారేజీలోని 14 గేట్లు పైకి ఎత్తి దిగువకు 1,02,400 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటి మట్టం 6.94 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.925 టీఎంసీల నీళ్ల నిల్వ ఉన్నాయి. ఇదిలాఉండగా, మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి పంపింగ్ కొనసాగుతోంది. ప్రాజెక్టులోని ఫేస్-2లోని రెండు మోటార్ల ద్వారా భూపాలపల్లి జిల్లా భీంఘనపురం రిజర్వాయర్‌కు 494 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. సమ్మక్కసాగర్ వద్ద 79.65 మీటర్ల నీటిమట్టం నమోదు కాగా, దేవాదుల ఇంటెక్‌వెల్ వద్ద 79.95 మీటర్ల నీటి మట్టం నమోదైంది.


తుపాకులగూడెం బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు


కాళేశ్వరం వద్ద ప్రవహిస్తున్న గోదావరి

కాళేశ్వరం వద్ద..

మహదేవపూర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి 6మీటర్ల 30 సెంటీమీటర్ల వరకు వరదనీరు చేరింది. ఐదు రోజుల నుంచి నదీ ప్రవాహం పెరుగుతూ, తగ్గుతూ వస్తుండగా తాజాగా గురువారం కురిసిన వర్షాలకు ఒక్కసారిగా వరద నీరు చేరి మెట్ల వద్దకు నీరు ఎగబాకింది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతుండడంతో వరద నీరు పెద్ద ఎత్తున పెరిగింది.

మేడిగడ్డ బ్యారేజీకి 77,500 క్యూసెక్కుల నీరు

మహదేవపూర్ రూరల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరదనీరు పెరుగుతోంది. బ్యారేజీలోకి 77,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం రెండు మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

ప్రాణం తీసిన పోలీసు భయం

- చల్వాయిలో ఉరివేసుకొని యువకుడి బలవన్మరణం
- 'ఇందిరమ్మ' ఇల్లు రాకపోవడంతో వాట్సాప్‌లో పోస్టులు
- ప్రభుత్వానికి వ్యతిరేక పోస్టులు పెడుతున్నాడని పోలీసుల జోక్యం
- కేసు పెడతారేమోననే భయంతో ఆత్మహత్య

గోవిందరావుపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేరు.. అమ్మమ్మే సర్వస్వం.. ఆపై పేదరికం.. ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశపడ్డాడు.. కానీ ఆయన ఆశలు నెరవేరలేదు.. లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోవడంతో ఆవేదనకు లోనయ్యాడు.. ఊళ్లోని వాట్సాప్ గ్రూపులో తన బాధను పంచుకున్నాడు.. అయితే ఈ చాటింగ్ ప్రభుత్వానికి వ్యతిరేకమని భావించిన పోలీసులు ఆ యువకుని మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు.. విచారణ నిమిత్తం స్టేషన్‌కు రావాలని ఆదేశించారు.. భయంతో వణికిపోయిన అతడు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయిలో గురువారం ఉదయం ఈ సంఘటన జరిగింది. పోలీసుల భయంతో చుక్క రమేష్ (29) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. చుక్క స్వరూప-గట్టయ్య దంపతులకు రమేష్, మౌనిక సంతానం. అనారోగ్యంతో స్వరూప, గట్టయ్యలు కొన్నేళ్లక్రితం మృతి చెందారు. మౌనికకు వివాహమై అత్త వారింటికి వెళ్లగా రమేష్ చల్వాయిలోని తన అమ్మమ్మ శెట్టి విశాల వద్ద ఉంటున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేసిన ఆయన కొద్దిరోజుల క్రితం చల్వాయికి వచ్చాడు. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకోగా జాబితాలో పేరు రాలేదు. తనకు అన్ని అర్హతలున్నా ఇల్లును మంజూరు చేయలేదని, అనర్హులకు ఇచ్చారంటూ 'చల్వాయి సమాచారం' అనే వాట్సాప్ గ్రూపులో పోస్టులు పెట్టాడు.


చల్వాయిలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు, బీఆర్‌ఎస్ నాయకులు

ఇదే గ్రూపులో సభ్యులుగా పస్రా ఎస్సైతోపాటు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభిమానులు ఉన్నారు. ఈ క్రమంలో ఇరు పార్టీల అభిమానులు ఒకరినొకరు విమర్శించుకుంటూ పోస్టులు పెట్టుకున్నారు. మంత్రి సీతక్క, ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్త నాగన్న పేరిట సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన లేఖను రమేష్ ఈ గ్రూపులో పోస్టు చేశాడు.

వాట్సాప్ గ్రూపులో పోస్టుల యుద్ధాన్ని పస్రా ఎస్సై కమలాకర్ గమనించారు. ఆయన ఆదేశాలతో బుధవారం సాయంత్రం చల్వాయికి వచ్చిన ఓ పోలీసు కానిస్టేబుల్... రమేష్ మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాడు. గురువారం స్టేషన్‌కు రావాలని సూచించాడు. తనపై కేసులు పెడతారేమోనని రమేష్ భయాందోళనకు గురయ్యాడు. అమ్మమ్మ బంధువుల ఇంటికి వెళ్లడంతో గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో రమేష్ దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కింట్లో ఉండే అలుగం రమేష్ అనే వ్యక్తి గమనించి చుట్టుపక్కల వారికి తెలిపాడు. విషయం తెలుసుకున్న పస్రా ఎస్సై కమలాకర్ చల్వాయికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఇంట్లో వెతకగా రమేష్ రాసిన సూసైడ్ నోట్ లభ్యమైనట్లు తెలిసింది. వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకున్న మనవడు ఆత్మహత్య చేసుకోవడంతో అమ్మమ్మ విశాల గుండెలవిసేలా రోదించింది.

రమేష్‌ది ప్రభుత్వ హత్య

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు, జర్నలిస్టులు, సామాన్యులపై రాష్ట్రమంత్రి సీతక్క అనుచరులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంపై నిలదీసిన రమేష్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే పొట్టనపెట్టుకుందని ధ్వజమెత్తారు. ములుగు ఏరియా ఆస్పత్రి మార్చురీ వద్ద రమేష్ మృతదేహానికి నివాళులర్పించిన ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. అమాయక యువకుడి మృతికి మంత్రి సీతక్క బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

మృతదేహంతో ఆందోళన

కాంగ్రెస్ నాయకులు, పోలీసుల కారణంగానే చుక్క రమేష్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, గ్రామస్థులు ఆరోపించారు. మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు రమేష్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించిన వారిపై భౌతికదాడులకు పాల్పడటమేకాక ఆత్మహత్యకు ప్రేరేపించేలా భయభ్రాంతులకు పాల్పడటం ములుగు జిల్లాలో కాంగ్రెస్ నాయకులకు పరిపాటిగా మారిందని ఆరోపించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ములుగు సర్కిల్ పోలీసులు కూడా చల్వాయిలో మోహరించారు. రాస్తారోకో ప్రభావంతో రహదారికి ఇరువైపులా పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళనను విరమింపజేసిన పోలీసులు రమేష్ మృతదేహాన్ని ములుగులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం జరిపించారు. మృతుడి అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ మృతుడి అంత్యక్రియలకు తక్షణ సాయంగా రూ.50వేలు అందజేశారు.

వాట్సాప్‌లో వేధించిన నలుగురిపై కేసు

చుక్క రమేష్ అమ్మమ్మ శెట్టి విశాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాట్సాప్‌లో అనుచిత వ్యాఖ్యలతో మానసికంగా వేధించి రమేష్ ఆత్మ హత్యకు కారణమైన చల్వాయికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ములుగు డీఎస్పీ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పబ్లిక్ న్యూసెన్స్ అంశంపై బుధవారం సాయంత్రం డయల్ 100కు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా పస్రా పోలీసులు చల్వాయికి వెళ్లారని, మద్యం సేవించిన స్థితిలో రమేష్ ఉన్నట్లు గుర్తించి తిరిగి వెళ్లిపోయారని తెలి పారు. మృతుడు రమేష్‌పై ఎటువంటి కేసు నమోదు చేయలేదని స్పష్టం చేశారు.

రవీందర్, ములుగు డీఎస్పీ


shanthi TALKIES
MYTHRI MOVIE DISTRIBUTORS LLP
RELEASING TODAY
SIDDHARTH
SARATH KUMAR
3BHK
'Every Ordinary Family has an Extraordinary Story'
WRITER - DIRECTOR SRI GANESH
PRODUCED BY ARUN VISWA


ప్రపంచవ్యాప్తంగా
నేడే
విడుదల
జురాసిక్ వరల్డ్
IN CINEMAS JULY 4
RELEASING IN ENGLISH, HINDI, TAMIL AND TELUGU
IN 3D
UNIVERSAL


ANIL SUNKARA PROUDLY PRESENTS
SKYLINE MOVIES
SHOW TIME
నేడే
విడుదల
WRITTEN & DIRECTED BY MADHAN DAKSHINAMOORTHY
PRODUCER KISHORE GARIKIPATI (G K)


ప్రపంచవ్యాప్తంగా
జూలై
11
విడుదల
IT BEGINS
A JAMES GUNN FILM
DC STUDIOS
సూపర్‌మ్యాన్
SUPERMAN
ONLY IN CINEMAS JULY 11
IN ENGLISH, HINDI & TELUGU
IN 3D & IMAX 3D
REAL D 3D Dolby Cinema IMAX
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
DIL RAJU PRODUCTION
T-SERIES MUSIC
నేడే
విడుదల
NITHIIN
తమ్ముడు
SRIRAM VENU
RAJU SHIRISH
K V GUHAN B.AJANEESH LOKNATH SH.PRAWIN PUDI G M SEKHAR



ఎంఈవోను కలిసిన వడుప్సా నాయకులు


ఎంఈవో మురళికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మట్టెవాడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వడుప్సా వరంగల్ జోన్ అధ్యక్షుడు కూచన క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ ఎంఈవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం.మురళిని మట్టెవాడలోని కార్యాలయంలో కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందించి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వడుప్సా(ట్రస్మా) జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్, జిల్లా కోశాధికారి శ్రీ ఠాగూర్ జ్ఞానేశ్వర్‌సింగ్, ట్రస్మా జిల్లా సలహాదారులు కొడెం శ్రీధర్, పొన్నోజు చక్రపాణి, జిల్లా ప్రతినిధులు ఆడెపు వెంకటేశ్వర్లు, రాజు, రవీందర్, మోహన్, రవి, చందర్‌బాబు, విశ్వనాథ్, ప్రవీణ్‌కుమార్, నర్సింహస్వామి, విశ్వేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధర్మకర్తను సన్మానించిన వాసవిక్లబ్ వనిత కమిటీ


భద్రకాళి ధర్మకర్త వీరన్నను సన్మానిస్తున్న వాసవి క్లబ్ వనిత సభ్యులు

మట్టెవాడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ భద్రకాళి దేవస్థానం ధర్మకర్త, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వరంగల్ అధ్యక్షుడు తొనుపునూరి వీరన్నను వరంగల్ వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. భద్రకాళి ధర్మకర్తగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వీరన్నకు వరంగల్ పిన్నవారి వీధిలోని వాసవి క్లబ్ భవనంలో వరంగల్ వాసవి క్లబ్ వనిత సభ్యులు శాలువా, బొకే అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు ఎలుగూరి కావ్య, శ్రీరాం శైలజ, రవ్వ గీత, పి.పద్మ, మాధవి, సుమ, సరళ, విష్ణుప్రియ, చంద్రకళ పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్‌లో ఉద్యోగుల నిరసన


మార్కెట్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

వరంగల్ వ్యవసాయం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి భాస్కర్‌పై వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ దాడిని ఖండిస్తూ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. టీఎన్‌జీవోస్ మార్కెట్ కమిటీ ఎంప్లాయిస్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలుక నర్సింహరెడ్డి, కార్యదర్శి ముక్రమ్ పిలుపు మేరకు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెట్ కమిటీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ.. మార్కెట్ కార్యదర్శిపై దాడికి పాల్పడిన వైస్ చైర్మన్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రేడ్-2 కార్యదర్శులు రాము, అంజిత్‌రావు, ఉద్యోగులు నర్సింగరావు, మురళి, గంగాధర్, సాగర్, స్వప్న, శ్రీకాంత్, వినయ్ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ మహాసభను జయప్రదం చేయాలి


ఐఎఫ్‌టీయూ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

ఖిలావరంగల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో ఈనెల 6న జరిగే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి రఘుసాల సుమన్ పిలుపునిచ్చారు. గురువారం ఖిలావరంగల్ పెట్రోల్‌పంపు వద్ద మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రథమ మహాసభ జూలై 6న ఇల్లెందులోని పసునూరి రాజునగర్‌లో జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వాలు మారినా నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. కార్మికులు సంఘటితంగా మారి ఉద్యమాల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే 9న కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు కుసుమ రమేష్, కందిక సురేందర్, నందనబోయిన కుమారస్వామి, బోళ్ల నగేష్, పిట్టల మల్లేశం, ఆకులపల్లి శ్రీనివాస్, సింగం కుమారస్వామి, జెన్నారం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీరన్న బోనాలకు బందోబస్తు నిర్వహించాలి

- మిల్స్‌కాలనీ సీఐని కోరిన కరీమాబాద్ బీరన్న దేవస్థాన కమిటీ


సీఐ రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీరన్న దేవస్థాన కమిటీ

కరీమాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీన తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కరీమాబాద్‌లో కురుమ కులస్థులు బీరన్నకు బోనాలు సమర్పించడం జరుగుతుందని, ఈ ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరె కృష్ణ మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేష్‌ను కోరారు. గురువారం కమిటీ సభ్యులు సీఐ రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిప్రతం అందజేసి ఉత్సవంలో నిర్వహించే ప్రధాన ఘట్టాలను వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లం పద్మరవి, మరుపల్ల రవి, కమిటీ సభ్యులు కృష్ణ, రాజు, సుధాకర్, లక్ష్మణ్, కుల పెద్దలు పురుషోత్తం, రాజు, ముఖ్య సలహాదారులు మల్లేశం, కొమురెల్లి, కుమారస్వామి, రాజేశ్వర్, నవీన్, సదానందం, మల్లేశం, తిరుపతి, శ్రీనివాస్, వేణు, రమేష్, అన్న శ్రీనివాస్, చిన్నరవి, మెట్టయ్య, రాజు, సతీష్, తదితరులు పాల్గొన్నారు. కాగా, బీరన్నకుంటలోని బీరన్న ఆలయాలను సీఐ బొల్లం రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా పూజారి బండారి పూజలు చేశారు. తదుపరి కరీమాబాద్ బురుజు సెంటర్‌ను సీఐ రమేష్, ఎస్సై సురేష్ సందర్శించారు.

ఆలస్యమవుతున్న ఆసరా

- పింఛన్ల కోసం దరఖాస్తు దారుల ఎదురుచూపులు
- ఇబ్బందుల్లో వితంతువులు, దివ్యాంగులు
- జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు 11,357
- ఆదేశాలు రాలేదంటున్న అధికారులు

వరంగల్ కలెక్టరేట్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఆసరా పింఛన్ల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా పేరును చేయూతగా మార్చింది. అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు దగ్గర పడుతున్నా పింఛన్లపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో అర్హులైన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు మూడున్నర సంవత్సరాల నుంచి నూతన పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెలా అధిక సంఖ్యలో పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకుంటున్నప్పటికీ మంజూరుకు మాత్రం నోచుకోవడం లేదు. చాలా మంది ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించి ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే దరఖాస్తుల సంఖ్య 11,357కు చేరింది. కాగా, కొత్త పింఛన్లపై ఎలాంటి ప్రకటన రాలేదని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో పింఛన్ కోసం వచ్చిన దరఖాస్తులు 11,357	
వృద్ధాప్య	3,659
వితంతు	4,442
దివ్యాంగులు	2,209
చేనేత	396
గీత కార్మికులు	104
బీడీ కార్మికులు	498
ఒంటరి మహిళలు	49

వెలువడని ప్రకటన..

గతంలో ప్రతి నెలా కొత్త పింఛన్లు మంజూరు చేసే విధానం అమలులో ఉండేది. రెండు సంవత్సరాలుగా పింఛన్ల మంజూరుపై ఎలాంటి ప్రకటన రావడం లేదు. ప్రతి నెలా అర్హులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు విచారణ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో పక్కన పెడుతున్నారు. ఈ నెలలోనే నూతన పింఛన్ ప్రక్రియ మొదలవుతుందని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. భార్యాభర్తల్లో ఎవరైనా ఒకరు ఆసరా పింఛన్ పొందుతూ మరణిస్తే ఆ పింఛన్‌ను భాగస్వామికి బదిలీ చేస్తున్నారు. పోయిన సంవత్సరం నుంచే స్పౌజ్ పింఛన్ల ప్రక్రియ కొనసాగుతోంది. స్పౌజ్ పింఛన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే మరుసటి నెలలోనే పింఛన్‌ను బదిలీ చేస్తున్నారు.



జిల్లాలో పింఛన్ పొందుతున్న వారి వివరాలు	
వృద్ధాప్య	46,389
వితంతు	46,465
దివ్యాంగులు	15,371
చేనేత	2,259
గీత కార్మికులు	2,825
బీడీ కార్మికులు	5,673
ఒంటరి మహిళలు	3,182
ఫైలేరియా బాధితులు	352
డయాలసిస్ బాధితులు	126

పింఛన్ ఇప్పించాలి

గౌరమ్మ, ఎల్‌బీనగర్, వరంగల్



పింఛన్ కోసం మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నా. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో సైతం మూడు సార్లు వినతిపత్రం అందజేసినా పింఛన్ రావడం లేదు. పని చేసుకుందామంటే ఆరోగ్యం సహకరించడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఇప్పటికైనా వృద్ధాప్య పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి.

కుటుంబ పోషణ భారంగా మారింది

జిలుకర దేవకమ్మ, కాట్రపల్లి, మండలం రాయపర్తి



నా భర్త జిలుకర లక్ష్మీనారాయణ 2022లో అనారోగ్యంతో మృతి చెందాడు. ఏ పని చేయాలన్నా నా ఆరోగ్యం సహకరించడం లేదు. అప్పటి నుంచి కుటుంబ పోషణ భారంగా మారింది. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకు మంజూరు కాలేదు. పింఛన్ మంజూరు చేయించి ఆదుకోవాలి.

గురుపౌర్ణమి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ


వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అడిషనల్ డీసీపీ

మట్టెవాడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎల్లంబజార్ సాయి సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుపౌర్ణమి వేడుకలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను గురువారం అడిషనల్ డీసీపీ (ట్రాఫిక్, లాఅండ్‌ఆర్డర్) రాయల ప్రభాకర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు సాయి సేవాదళ్ సభ్యులను అభినందించి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆరుట్ల శ్రీనివాస్, సభ్యులు పోలా మహేశ్, మన్నవ మోహనకృష్ణ, ఇరుకుల్ల నాగేశ్వర్‌రావు, రవీంద్రచారి, స్వరాజ్యబాబు, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలి

మట్టెవాడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జూలై 4వ తేదీన కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న సభలో వరంగల్ నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, శాప్ మాజీ డైరెక్టర్ రాజనాల శ్రీహరి అన్నారు. గురువారం వరంగల్‌లోని ఒక ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీహరి మాట్లాడుతూ బహిరంగ సభకు అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలెపాక ప్రసాద్, లోక వినోద్‌నాయక్, బానోతు వెంకన్న నాయక్, శేఖర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ డైరెక్టర్ రాజనాల శ్రీహరి

వరంగల్ జిల్లా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెంకట్రామ్



వరంగల్ లీగల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది బి.వెంకట్రామ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. బి.వెంకట్రామ్ 40 ఏళ్లుగా ఉమ్మడి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆయన నియామకం పట్ల సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

వరంగల్ జిల్లా పోక్సో కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెంకటరమణ



వరంగల్ లీగల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది గంప వెంకటరమణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. వరంగల్ పట్టణానికి చెందిన వెంకటరమణ 2007 నుంచి న్యాయవాదిగా ఉభయ జిల్లా కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు

ఖిలావరంగల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మానవ, బాలల అక్రమ రవాణాను నిరోధించడానికి విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రధానోపాధ్యాయుడు శైలేంద్రకుమార్ అన్నారు. గురువారం ఖిలావరంగల్ మధ్యకోటలోని ప్రభుత్వ ఆరెల్లి బుచ్చయ్య ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చైల్డ్ ట్రాఫికింగ్, సైబర్ క్రైంపై అవగాహన సదస్సును ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా సెల్‌ఫోన్‌లలోని కొత్త వ్యక్తులతో చాటింగ్, ఇన్‌స్టాగ్రాం అకౌంట్లతోచాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నూతన వ్యక్తులతో పరిచయాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర విషయాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. మై చాయిస్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ జె.క్రాంతి, ఎఫ్‌ఎంఎం జిల్లా కోఆర్డినేటర్ ఇ.శ్రీకాంత్, సీనియర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జె.శృతిగిల్లా, ఇ.సుదర్శన్, జోసఫ్,శోభారాణి, సిరిచందన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం : ఏఐఎస్ఎఫ్

ఖిలావరంగల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ విమర్శించారు. గురువారం శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో ఖిలావరంగల్ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య పేదవారికి అందని ద్రాక్షగా మారిందన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను అంగడి సరుకుగా మార్చాయని ఆరోపించారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, బుక్స్ ఫీజులంటూ లక్షలాదిరూపాయలు దోచుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణలో శ్రీచైతన్య, నారాయణ, ఇతర కార్పొరేట్ విద్యాసంస్థలకు విద్యాశాఖ అధికారులు వత్తాసు పలకడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. కనీసం వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థల వద్ద ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు శివకుమార్, రాకేష్, ప్రశాంత్, సోను, మహేష్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పరిశీలన పకడ్బందీగా నిర్వహించండి

- గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్


రేషన్‌కార్డుల వెరిఫికేషన్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో రేషన్‌కార్డుల వెరిఫికేషన్ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. వెరిఫికేషన్ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. వరంగల్ జిల్లాకు సంబంధించి కొత్త రేషన్ కార్డుల కోసం 12,200 దరఖాస్తులు, హనుమకొండ జిల్లా పరిధిలో 16,700 కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, ఇప్పటి వరకు 50శాతం వెరిఫికేషన్ పూర్తయిందని వెల్లడించారు. ఈ నెల 10లోగా టార్గెట్ పూర్తి చేయాలని అన్నారు. ఆర్‌పీలు, ఆర్ఐలు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ఏమైనా సాంకేతిక సమస్యలు ఏర్పడితే డీఎస్‌డీపీ సాంకేతిక సిబ్బంది సహాయం తీసుకుని పని పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల అధికారి కృష్ణయ్య, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ప్రసన్నరాణి, ఆర్‌పీలు యూసుఫ్, షహజాది గేడం, టీఎంసీ రమేష్, సీపీలు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి..

బూత్ లెవల్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్, రిటర్నింగ్ అధికారి చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. గురువారం 106-వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని బూత్‌స్థాయి అధికారులకు ఐఎంఏ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ హాజరై మాట్లాడారు. ప్రతీరోజు 50 మందికి ఓరియంటేషన్ తరగతులు నిర్వహించాలని, ఓటరు లిస్టులో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని అన్నారు. ప్రతీ ఇంట్లో 18ఏళ్ల నిండిన యువతీ యువకులతో పాటు మృతి చెందిన వారి వివరాలను సేకరించాలని అన్నారు. బీఎల్‌వోలు ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఎన్నికల డీటీ సుభాన్, మాస్టర్ ట్రైనీ సందీప్‌తో పాటు కనుకయ్య, నాగరాజు పాల్గొన్నారు.

బీరన్న బోనాలకు మేయర్‌కు ఆహ్వానం


మేయర్‌కు బీరన్న బోనాల ఆహ్వాన పత్రం అందిస్తున్న నిర్వాహకులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): యేటా తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ నెల 6న వరంగల్ కరీమాబాద్‌లో కురుమ కులస్థులు నిర్వహించే ఉర్సు బీరన్న బోనాల పండుగకు మేయర్ గుండు సుధారాణికి ఆహ్వానం పలికారు. గురువారం బీరన్నస్వామి దేవాలయ కమిటీ సభ్యులు మేయర్‌ను కలిసి ఆహ్వాన పత్రం అందించి ఘనంగా సన్మానించారు. మేయర్‌ను కలిసిన వారిలో దేవాలయ కమిటీ చైర్మన్ మరుమల్లి రవితో పాటు ధర్మకర్తలు మిరియాల కుమారస్వామి, మండల ప్రమీల, కోటేశ్వర్, మరుపల్ల గౌతమ్ తదితరులు ఉన్నారు.

శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్‌కు..

కరీమాబాద్: ఈనెల 6న తొలి ఏకాదశి పర్వదినాన కురుమల ఆరాధ్య దైవం బీరన్న బోనాల ఉత్సవాలకు రావాలని కోరుతూ తెలంగాణ శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్‌ను ఉర్సు బీరన్న స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ మరుపల్ల రవి కోరారు. గురువారం ఉర్సు బీరన్న దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు బండా ప్రకాష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి బోనాల ఉత్సవానికి రావాలని కోరారు. కార్యక్రమంలో ధర్మకర్తలు మిరియాల కుమారస్వామి, మండల ప్రమీల, గౌడ కోటేశ్వర్, మరుపల్ల గౌతమ్ పాల్గొన్నారు.

విపత్తులను సమర్థంగా ఎదుర్కోనాలి

- ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యం
- ఎన్‌డీఎంఏ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాశ్



సమావేశంలో మాట్లాడుతున్న నావల్ ప్రకాశ్

వరంగల్ కలెక్టరేట్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విస్తృత ప్రజా భాగస్వామ్యంతోనే సమర్థ విపత్తు నిర్వహణ సాధ్యమని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎన్‌డీఎంఏ) సీనియర్ అధికారుల బృందం పేర్కొంది. ఎన్‌డీఎంఏ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాశ్, అండర్ సెక్రటరీ అభిషేక్ బిశ్వాస్, సీనియర్ కన్సల్టెంట్లు వసీం ఇక్బాల్, గౌతమ్‌కృష్ణ, సంద్రా, అనుపమ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లాలో విపత్తు నిర్వహణ సవీకరణ, డిజాస్టర్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ కార్యకలాపాలు, విపత్తు ముప్పు తగ్గింపుతోపాటు భవిష్యత్‌లో విపత్తులను ఎదుర్కొనే వ్యవస్థ పటిష్టత తదితర అంశాలపై సమీక్షించారు. చట్ట ప్రకారంగా కొత్తగా పట్టణ విపత్తు నిర్వహణ అథారిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి వైపరీత్యాలపై రియల్‌టైమ్ హెచ్చరికల వ్యవస్థలో సచేత్ కీలక మైలురాయి అని, ఈయాప్‌పై అధికారులతోపాటు ప్రజలకు ముఖ్యంగా గ్రామస్థులలో అవగాహన కల్పించాలని వారు సూచించారు. విపత్తు నిర్వహణ ప్రణాళికలో ఏఐ, డ్రోన్ టెక్నాలజీ వంటి సాంకేతికతను పొందుపర్చడంపై దృష్టి పెట్టాలన్నారు. ఆపదమిత్ర, ఇతర వలంటీరు సేవలకు యువతను ప్రోత్సహించాలని ఎన్‌డీఎంఏ బృందం పేర్కొంది.

కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి 24 గంటలు సహాయం చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం ద్వారా ఆపదమిత్ర కింద 179 మంది వలంటీర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అధికంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామస్థాయిలో కమిటీలను తహసీల్దార్ అధ్యక్షతన ఏర్పాటు చేశామని, వరద ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొరతనంపై రణకేతనం

నైజాం నిరంకుశత్వంపై ఎగిసిన రగల్‌జెండా దొడ్డి కొమురయ్య



- వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాటం
- ఊరేగింపులో వస్తుండగా దేశ్‌ముఖ్ గూండాల కాల్పులకు బలి
- కొమురయ్య మరణంతో ఎగిసిన సాయుధ పోరాటం
- నేడు కడవెండిలో దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి

6

భూమి కోసం.. భుక్తి కోసం.. బానిస బతుకుల నుంచి విముక్తి కోసం.. పోరు సల్పిన వీరుడు దొడ్డి కొమురయ్య. విస్నూర్ ప్రాంతంలో దేశ్‌ముఖ్ అనుచరుల ఆగడాలకు వ్యతిరేకంగా ఉద్యమించి, వారి తుపాకి తూటాలకు నేల కొరిగాడు. దేవరుప్పుల మండలంలోని కడవెండి వాసి అయిన కొమురయ్య వీర మరణంతో తెలంగాణ ప్రాంతమంతా ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. నైజాం నిరంకుశత్వాన్ని కూల్చే దాకా కొనసాగాయి. ఈ రోజుతో (జూలై 4) కొమురయ్య త్యాగానికి 79 ఏళ్లు పూర్తవుతున్నాయి. దొరతనంపై రణకేతనం ఎగురవేసిన ఆ వీరుడికి నివాళులర్పించే సందర్భమిది...

- ఆంధ్రజ్యోతి, దేవరుప్పుల

కొండంత ఉత్కంఠ



కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిసిన కొండా దంపతులు

- ఇటీవలి పరిణామాలు, నేపథ్యాలపై 16 పేజీల నివేదిక సమర్పణ
- ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చినట్లుగా సమాచారం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని 'బొంగు' వ్యాఖ్యలపై ఫిర్యాదు
- 5లోగా వివరణ ఇవ్వాలని గతంలోనే క్రమశిక్షణ సంఘం నోటీసులు
- రేపటితో ముగియనున్న గడువు..
- కొండా దంపతులు మీనాక్షిని కలవటంపై రాజకీయాల్లో ఉత్కంఠ
- అధిష్ఠానం నిర్ణయం కోసం వేచిచూస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లు కాంగ్రెస్‌లో విభేదాలు మరోసారి హీటెక్కాయి. తనపై ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీపై కొండా దంపతులు అధిష్ఠానానికి ఫిర్యాదు చేయటం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షినటరాజన్‌ను గురువారం మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావులు కలవటం హాట్‌టాపిక్‌గా మారింది. ఉమ్మడి జిల్లాలోని 11మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీ, మేయర్, ప్రభుత్వ సలహాదారుడు, ఇంచార్జీ మంత్రిపై పలు ఫిర్యాదులతో కూడిన 16 పేజీల నివేదికను మీనాక్షినటరాజన్‌కు అందించినట్లు తెలిసింది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని వాడిన బొంగు వాఖ్యల వీడియోతో సహా ఫిర్యాదు చేశారు. అలాగే కొండా సుస్మిత ఇన్‌స్టాలో పోస్టు చేసిన వ్యాఖ్యలపై కూడా కొండా దంపతులు వివరణ ఇచ్చినట్లుగా సమాచారం.

క్రమశిక్షణ సంఘం గడువు

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలపై మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేసిన వాఖ్యలపై క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి ఇచ్చిన షోకాజ్ నోటీసులకు శనివారం (5వ తేదీ) వరకు వివరణ ఇవ్వాల్సి ఉంది. జూన్ 19వ తేదీన వరంగల్ పోచమ్మమైదాన్‌లో రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలపై అనుచిత వాఖ్యలు చేశారు. దీనిపై 21వ తేదీన ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ తీవ్రంగా ఖండించారు. 22వ తేదీన ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో పాటు క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవికి ఫిర్యాదు చేశారు.

అయినప్పటికీ ఒకరిపై మరొకరు పరస్పర ఆరోపణలు, విమర్శల దాడిని కొనసాగించారు. అయితే సొంత జిల్లాలోని నేతలతో విభేదాలపై 28వ తేదీన కొండా మురళి క్రమశిక్షణ సంఘానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో తనకు ఉన్న బలం, తనకు ఎవరెవరితో ఎందుకు విభేదాలు ఉన్నాయో ఆరు పేజీల నివేదికతో క్రమశిక్షణ సంఘానికి అందించారు. ఈ క్రమంలో జూలై 5వ తేదీలోగా ఎమ్మెల్యేపై చేసిన వాఖ్యలకు వివరణ ఇవ్వాలని కొండా మురళికి క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై వివరణ ఇచ్చేందుకు కొండా దంపతులు సిద్ధమవుతున్నట్లుగా సమాచారం. ఇదిలా వుండగా, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జికి 16పేజీల నివేదిక ఇవ్వటంతో క్రమశిక్షణ సంఘానికి కూడా ఇదే నివేదికను సమర్పించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ నివేదిక ఆధారంగా క్రమశిక్షణ సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది పార్టీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

చిట్టక్క పోస్టు రచ్చ రచ్చ

కొండా దంపతుల రాజకీయ వారసురాలు కొండా సుస్మిత (చిట్టక్క) చేసిన సోషల్‌మీడియా పోస్టు రాజకీయాల్లో రచ్చరచ్చగా మారింది. మే 31వ తేదీన పరకాల స్థానం నుంచి తానే అభ్యర్థినంటూ సుస్మిత తన ఇన్‌స్టాలో ప్రొఫైల్ ట్యాగ్ చేసుకున్నారు. ఇప్పటికే పరకాల ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ సంఘం కొండా మురళికి షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలో సుస్మిత చేసిన పోస్టు అగ్నికి ఆజ్యం పోసినట్లైందనే చర్చ జరుగుతోంది. దీనిపైనే కొండా దంపతులు మీనాక్షి నటరాజన్‌కు వివరణ కూడా ఇచ్చినట్లుగా సమాచారం.

ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జితో భేటీ

ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావులు గురువారం భేటీ కావటం చర్చనీయాంశంగా మారింది. మీనాక్షికి 16పేజీల నివేదిక ఇవ్వటంతో ఆ నివేదికలో ఏముందో అనేది రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే సభకు సంబంధించి జనసమీకరణపై మాట్లాడామని కొండా మురళి చెబుతున్నప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై పలు ఆరోపణలతో కూడిన నివేదిక ఇచ్చినట్లుగా సమాచారం. తన ప్రమేయం లేకుండానే తన నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి ఎమ్మెల్యేలతో కలిసి పోస్టింగులు ఇప్పించటం, అభివృద్ధి పనుల్లో పాల్గొనటం చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లుగా తెలిసింది. అలాగే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మీడియాలో 'బొంగు' అనే పదాన్ని వాడిన వీడియోను కూడా మీనాక్షి నటరాజన్‌కు చూపించినట్లుగా సమాచారం.

నేను బీసీ వర్గాల ప్రతినిధిని..

- పోటా, టాడా కేసులకే భయపడలేదు..
- కావాలనే నన్ను రెచ్చగొడుతున్నారు..
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

6



ఉగ్రప్రభ త్వరితమాత అలంకరణలో అమ్మవారు

8వ రోజుకు చేరిన భద్రకాళి శాకంబరీ వేడుకలు

వరంగల్ కల్చరల్ జూలై 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ వేడుకలు గురువారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యపూజ అనంతరం అష్టమికి ఆది దేవత శంకరుడు దశమహా విద్యల్లో కాళీక్రమంను అనుసరించి ఉదయం ఉగ్రప్రభ.. జ్ఞానశక్తిని త్వరితమాత గాను అలంకరించి పూజారాధన చేశారు. అమ్మవారి విభూతి అయిన ఈ ఉగ్రపభ మాతకు ప్రత్యంగిరా అనే నామం కూడా ఉంది. ఈ అమ్మవారు భక్తులను అనుగ్రహించి అభయమిస్తుందని అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. కాగా, పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు

- క్షేత్రస్థాయిలో పరిశీలించి మాస్టర్ ప్లాన్‌పై నివేదిక సమర్పించాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్

ములుగు/తాడ్వాయి జూలై 3 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లకోసారి జరిగే మేడారం మహాజాతరకు పక్కా ప్రణాళికలతో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామంలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గద్దెల పరిసరాలను, క్యూ లైన్లు, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, కన్నెపెల్లి సారలమ్మగుడి, చిలకలగుట్ట పరిసరాలు జిల్లా కలెక్టర్ దివాకర, సీఎస్ సలహాదారు గోవిందహరితో కలిసి పరిశీలించారు. అనంతరం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తదనంతరం ఐటీడీఏ అతిథి గృహంలోని సమావేశ మందిరంలో మహాజాతర అభివృద్ధిపనులపై సంబంధిత అధికారులుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాస్తు శిల్పి రాజశేఖర్ మేడారం మాస్టర్ ప్లాన్‌ను స్లైడ్ షో ద్వారా పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ స్లైడ్ షోలో జంపన్నవాగు అభివృద్ధి పనులు, పలు వంతెనల ఏర్పాటు, అధునాతన కూడళ్ల ఏర్పాటు, రోడ్డు విస్తరణ పనులు, దేవస్థానం చుట్టూ అభివృద్ధి, భక్తుల కోసం విశాలమైన క్యూలైన్ల ఏర్పాటు, పార్కింగ్ స్థలాలు, భక్తుల వసతి, పూజారుల వసతి, గిరిజన సంఘాల వసతి, స్నాన ఘట్టాలు, అన్నదాన సత్రాలు, ప్రసాదాల కౌంటర్ల ఏర్పాటు, గద్దెలు, పరిసరాలు ముఖ ద్వారాలు రాతి కట్టడాలతో నిర్మించేలా చేసిన డిజైన్‌లను చూపించారు. అనంతరం శైలజారామయ్యర్ మాట్లాడుతూ 2026 మహా జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉన్నత సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. 100 ఏళ్లకుపైగా నిలిచి ఉండేలా శాశ్వత నిర్మాణాలు చేపడతామన్నారు. మేడారం అభివృద్ధికి పూజారులు, దేవాదాయశాఖ, గిరిజనశాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి, వారికి సులువైన దర్శనం అయ్యేలా చూడాలన్నారు. తల్లుల దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు భంగం కలగకుండా ఆధ్యాత్మికత పెంపొందేలా అభివృద్ధి చేపడతామని అన్నారు. గిరిజనులు, పూజారులకు ఏమైనా సందేహాలు ఉంటే తెలియజేయాలన్నారు. అభివృద్ధి పనులకు ఆరు నెలల సమయం ఉందన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగేలా శాశ్వత పనులకు ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేడారం అభివృద్ధి జరగాలంటే భూసేకరణ ప్రధానమన్నారు. మేడారం గిరిజనులు, పూజారులు భూసేకరణకు అడ్డు పడకుండా సహకరించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంలో ఏమైన సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దివాకర ద్వార మీ డిమాండ్లు ప్రభుత్వానికి తెలియపరచాలన్నారు. మాస్టర్ ప్లాన్‌ను వాస్తు శిల్పి అద్భుతంగా రూపొందించారని అభినందించారు.


మేడారం పరిసరాలను పరిశీలిస్తున్న శైలజారామయ్యర్


ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు


పెండింగ్ బిల్లులు చెల్లించాలి..

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

వరంగల్ కలెక్టరేట్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను చెల్లించాలని కోరుతూ కార్మికులు గురువారం వరంగల్ కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు బైరబోయిన సరోజన యాదవ్ మాట్లాడుతూ గత ఐదు నెలల బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వమే కోడిగుడ్లు, గ్యాస్ పొయ్యి అందించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలనే పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ సత్య శారదకు అందజేశారు. ధర్నా కార్యక్రమంలో ఎస్.వనజ, ఎన్.చంద్రకళ, స్వర్ణలత, శారద, సంధ్య, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని కోడలు.. గుండెపోటుతో మామ..

ఒకే కుటుంబంలో ఇద్దరి మృతి.. అవుతాపురంలో విషాదం


ఝాన్సీ(ఫైల్)

పెద్దవంగర, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని అవుతాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. వేముల సంతోష్-వేముల ఝాన్సీ 2011లో వివాహం జరిగింది. వారికి కుమారుడు అఖిల్ తేజ, కుమార్తె అభిదామాని ఉన్నారు. సంతోష్ పెద్దవంగర మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం (ఎంఆర్సీ)లో సీఆర్పీగా, ఝాన్సీ తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. ఝాన్సీ పని చేస్తున్న విద్యసంస్థలో ఒకరు ఆమెను మందలించారు. దీంతో మానసికంగా కుంగిపోయిన ఝాన్సీ (35) గురువారం ఇంటివద్దనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, రెండు రోజుల కిందట విద్యా సంస్థలో ఒకరు మందలించారని తీవ్ర మనస్థాపం చెందింది. పాఠశాలకు ఇక వెళ్లనని భర్తకు చెప్పి ఇంటి వద్దనే ఉంటున్నది. గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఝాన్సీ ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుంది. కోడలి మరణవార్త తెలియడంతో గత కొద్ది రోజులుగా గుండెనొప్పితో బాధపడుతున్న వేముల లక్ష్మయ్య మామ గుండెపోటుతో మృతి చెందాడు. గంటల వ్యవధిలోనే ఒకే ఇంట్లో కోడలు, మామ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లక్ష్మయ్యకు భార్య సరోజన కుమారులు ప్రకాష్, సంతోష్ ఉన్నారు. ఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై క్రాంతికిరణ్ వివరణ కొరగా.. ఘటన స్థలాన్ని పరిశీలించామని, ఫిర్యాదు అందిన వెంటనే పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామన్నారు.


రమేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న అమ్మమ్మ విశాల

ప్రాణం తీసిన పోలీసు భయం

చల్వాయిలో ఉరివేసుకొని నిరుపేద యువకుడి బలవన్మరణం

- 'ఇందిరమ్మ' ఇల్లు రాకపోవడంతో వాట్సాప్‌లో పోస్టింగ్‌లు
- ప్రభుత్వానికి వ్యతిరేక పోస్టులు పెడుతున్నాడని పోలీసుల జోక్యం
- సెల్‌ఫోన్ స్వాధీనం.. స్టేషన్‌కు రావాలని ఆదేశం
- కేసు పెడతారేమోననే భయంతో ఆత్మహత్య
- రాస్తారోకో చేసిన బంధువులు, బీఆర్ఎస్ శ్రేణులు
- వాట్సాప్‌లో వేధించిన నలుగురిపై కేసు నమోదు

6

తనకు అన్ని అర్హతలు ఉన్నా 'ఇందిరమ్మ' ఇల్లు రాలేదని ఓ యువకుడు గ్రామ వాట్సాప్ గ్రూపులో పెట్టిన పోస్టు.. అతడి ప్రాణాలనే బలిగొన్నది. అటు అధికార పార్టీ నాయకులు, ఇటు పోలీసులు బెదిరింపులకు దిగడంతో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయిలో చోటుచేసుకుంది. పోలీసుల భయంతో చుక్క రమేష్(29) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాంగ్రెస్ నాయకులు, పోలీసుల కారణంగానే రమేష్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, గ్రామస్తులు ఆరోపించారు. మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంపై నిలదీసిన రమేష్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే పొట్టనపెట్టుకుందని బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాగా, వాట్సాప్‌లో అనుచిత వ్యాఖ్యలతో మానసికంగా వేధించి రమేష్ ఆత్మహత్యకు కారణమైన చల్వాయికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ములుగు డీఎస్పీ రవీందర్ తెలిపారు. కాగా, రమేష్ అంత్యక్రియలు గురువారం రాత్రి చల్వాయిలో ముగిశాయి.

- ఆంధ్రజ్యోతి, గోవిందరావుపేట

సమగ్రంగా ఇంటింటి ఓటరు సర్వే చేయాలి

దుగ్గొండి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఓటర్ల జాబితాలను, తప్పొప్పులను సరిచేసి స్థానిక ఎన్నికలకు ఓటర్ల జాబితాలను బీఎల్ వోలు సిద్ధంచేయాలని ఆర్డీవో పి.ఉమారాణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం బీఎల్‌వోలకు, సూపర్‌వైజర్లకు ఓటర్ల జాబితాలపై శిక్షణ ఏర్పాటు చేయగా ఆర్డీవో పాల్గొని మాట్లాడారు. ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియని, ఓటర్ల వయస్సు ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటారన్నారు. గ్రామాల్లో బీఎల్‌వోలు సర్వే చేసిసరియైన ఓటర్లను గుర్తించాలన్నారు. చనిపోయిన వారిని తొలగించాలన్నారు. మండలంలోని 49 పోలింగ్ స్టేషన్‌లను గుర్తించామని, ప్రతీ స్టేషన్‌కు ఒక్కరు చొప్పున బీఎల్‌వో లను నియమించామని తెలిపారు. ఈ శిక్షణలో తహసీల్దార్ రాజేశ్వ ర్‌రావు, ఆర్‌ఐ రాంబాబు, చిన్న మల్లయ్య, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

● నల్లబెల్లి(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇంటింటి ఓటరు సర్వేను సమగ్రంగా చేయాలని బీఎల్‌వోలకు ఆర్డీవో ఉమారాణి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ హై స్కూల్లో బీఎల్‌వోలకు ట్రైనింగ్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. బీఎల్‌వోలు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల జాబితా ప్రక్రియను సరిచేయాలని తెలిపారు. అలాగే బీఎల్‌వోలు ఏలా వేగవంతంగా పనిచేయాలి, పనితీరు ఏలా ఉండాలి, ప్రతీ ఇంటికి వెళ్లి ఓటరు సర్వేను ప్రజలకు అర్థమయ్యే విధంగా ఏలా తెలియజేయాలని తగు సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముప్పు కృష్ణ, మండల గిర్దావర్ కార్తీక్, కల్పన, చామంతి, సుధాకర్‌రావు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందని రాయితీ విత్తనాలు

● అన్నదాతలపై పెరిగిపోతున్న విత్తన భారం

● ప్రైవేటుగా కొని మోసపోతున్న వైనం

ఖానాపురం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల నుంచి రైతులకు రాయితీ విత్తనాలు అందడంలేదు. దీంతో రైతులపై విత్తన భారం పడుతోంది. ప్రైవేటు వ్యాపారుస్తుల నుంచి రైతులు విత్తనాలను కొనుగోలు చేసి మోసపోతున్నారు. ప్రభుత్వం రైతులకు అందించే రాయితీ విత్తనాల సరఫరాను నిలిపివేయడంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న విత్తనాలను అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం పంటల సీజన్ ప్రారంభమైంది. మండలంలో ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న. పత్తి విత్తనాల ధరలు పెరగడంతో రైతులపై ఆర్థికంగా భారం పడుతోంది. ప్రభుత్వం రాయితీ విత్తనాలను సరఫరా చేయకపోవడంతో పూర్తి ధర చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది.

మండలంలో వానాకాలంలో 28వేల ఎకరాల్లో సాగు

ఈ వానాకాలం సీజన్‌లో మండల వ్యాప్తంగా సుమారు 28వేల ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. 16,500 ఎకరాల్లో వరి, 3వేల ఎకరాల్లో పత్తి, 3వేల ఎకరాల్లో మొక్కజొన్న, 650 ఎకరాల్లో మిర్చి, మరో 5వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేయనున్నారు. ఇందుకు అవసరమైన విత్తన ప్రణాళికలను వ్యవసాయ అధికారులు రూపొందించారు. అవసరమైన విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందిచకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారుస్తులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే పలు ప్రైవేటు కంపెనీలు తమకు సంబంధించిన విత్తనాలను సాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చని ప్రచారం చేస్తుండడంతో రైతులు వాటికి ఆకర్షితులై కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. దీంతో రైతులపై విత్తన భారం పెరుగుతోంది. అయినప్పటికీ ప్రైవేటుగా కొనుగోలు చేసిన విత్తనాలు నాణ్యత లేకపోవడంతో ఇటీవల కాలంలో ధర్మరావుపేట, బుధరావుపేట, మనుబోతులగడ్డ గ్రామాల్లో పంటల దిగుబడిపై ప్రభావం చూపడంతో రైతులు ఆందోళనలు సైతం చేపట్టారు.

రైతులపై ఆర్థిక భారం

ప్రభుత్వం గతంలో రైతులకు రాయితీపై నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసేవారు. వరి, మొక్కజొన్న విత్తనాలకు కిలోకు రూ.35 చొప్పున రాయితీ అందించేది. ప్రస్తుతం రాయితీ నిలిచిపోవడంతో అదనంగా డబ్బులు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ఒక ఎకరం పొలంలో సుమారు 20 కిలోల వరి విత్తనాలు వేస్తారు. ఈ లెక్కన రైతులు బహిరంగ మార్కెట్లో వరి విత్తనాలు కొనుగోలు చేస్తే ఎకరాకు రూ. 700 భారం పడుతోంది. అదేవిధంగా పత్తి, మొక్కజొన్న విత్తనాల కొనుగోలుపై రైతులపై అదనపు భారం పడుతోంది. కాగా, మండలంలో ఇటీవల రాయితీపై జీలుగ విత్తనాలను అందించారు.

విత్తనోత్పత్తి కిట్ల పంపిణీ..

పూర్వ కాలంలో పంట పొలంలో మేలైన విత్తనాలను రైతులే సేకరించి భద్ర పరుచుకొనేవారు. వాటిని మరుసటి సీజన్‌లో సాగుకు ఉపయోగించేవారు. నేడు రైతులు ఆ సాంప్రదాయాన్ని మరిచిపోయి పంటల సాగుకు అవసరైన విత్తనాలను ప్రైవేటు వ్యాపారస్తులు (కంపెనీల) నుంచి కొనుగోలు చేస్తున్నారు. నాటి సాంప్రదాయాన్ని మరోమారు గుర్తు చేస్తూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లోనే రైతులు నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసుకోవడానికి ప్రణాళికలు రూపొందించి నాణ్యమైన గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో ప్రతి గ్రామంలో ముగ్గురు ఔత్సాహిక రైతులను గుర్తించి విత్తనోత్పత్తి కిట్లను అందజేశారు. మండలం వ్యాప్తంగా 14 రెవెన్యూల్లో ప్రతీ రెవెన్యూ గ్రామానికి ముగ్గురు చొప్పున రైతులకు విత్తనోతత్పత్తి వరి విత్తనాల కిట్లను రైతులకు అందజేశారు. వీటితో రైతులు తమకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసుకొని తదుపరి సీజన్లకు వినియోగించుకునేందుకు వ్యవసాయ అధికారులు రైతులను సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమం సఫలీకృతమైతే రైతులు విత్తనాల కోసం ప్రైవేటు వ్యాపారస్తులను ఆశ్రయించకుండా విత్తనాలను ఉత్పత్తి చేసుకుంటారు.



రైతులకు విత్తన ఉత్పత్తి కిట్లను అందజేస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ హరిబాబు, ఏవో శ్రీనివాస్ (ఫైల్)

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి

బోగ శ్రీనివాస్, ఏవో, ఖానాపురం



విత్తన డీలర్లు ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి. అధిక ధరలకు విత్తనాలను విక్రయించరాదు. విత్తనాలను బ్లాక్ మార్కెటింగ్ చేయరాదు, రైతులు విత్తన విక్రయ లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేసి రసీదులను భద్ర పరుచుకోవాలి.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

● బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సిటిజన్ ఫంక్షన్‌హాల్‌లో రూరల్ మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో తాను తెచ్చిన జీవోలు దొంగ జీవోలు అన్న ఎమ్మెల్యే అవే నిధులతో నేడు నియోజకవర్గంలో బ్రిడ్జీలు, చెక్‌డ్యామ్‌లు, బీటీ రోడ్ల పనులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఎలా చేస్తున్నారో ప్రజలకు చెప్పాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధిపై ప్రజలు నిలదీస్తారని హడావిడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసున్నారన్నారు. శిలాఫలకాలు జీవోలు, ఎజెన్సీ లేకుండా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం అవసరంఏముందో చెప్పాలన్నా రు. అసంపూర్తిలో ఉన్న రోడ్లు, ఇతర పనులను పూర్తి చేయాలన్నారు. పేద ప్రజల వైద్యం కోస మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రి తీసుకువచ్చానని సుదర్శ న్‌రెడ్డి అన్నారు. మెడికల్ కళాశాలలో ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ నాయకులు దందాలు చేస్తున్నారని ఆరోపించారు. కక్షపూరితంగా మేజర్ గ్రామాలను మున సిపాలిటీలో విలీనంచేసిన కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నా రు. మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, మోతె జైపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మచ్చిక నర్సయ్య, మోటూరి రవి తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ మునిసిపాలిటీ ఏమైంది?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నెక్కొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాను ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే నెక్కొండను మునిసిపాలిటిగా చేస్తామంటూ హామీ ఇచ్చిన దొంతి మాధవరెడ్డి అధికారం చేపట్టి 18 నెలలు కావస్తున్నా మునిసిపాలిటీ జాడేలేదని నెక్కొండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంగని సూరయ్య, నియోజక వర్గం నాయకులు కొమ్ము రమేశ్‌యాదవ్ ప్రశ్నించారు. గురువారం నెక్కొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మునిసిపాలిటీ ఏర్పాటు విషయమై ఎమ్మెల్యే రాష్ట్రస్థాయిలో ప్రయత్నాలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కాంగ్రెస్ నాయకులు మునిసిపాలిటీ విలీనం కోసమంటూ నెక్కొండ పరిసర ఐదు గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో గ్రామ సభలను నిర్వహించి గ్రామస్థుల మధ్య గొడవలు సృష్టించారంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలన కాలంలో గిరిజన తండాలకు రోడ్ల నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఎస్‌టీ ఎస్‌డీఎఫ్ నిధులు జీవో నెంబరు 260 ద్వారా రూ.32.56 కోట్లు మంజూరి చేయించారని తెలిపారు. ఆ నిధులను ఎమ్మెల్యే మాధవరెడ్డి తండాల అభివృద్ధికి కేటాయించకుండా దారి మళ్లించి చంద్రుగొండ క్రాస్ రోడ్డు నుంచి సంగెం వరకూ బీటి రోడ్డు నిర్మాణానికి కేటాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. మండలంలోని 21 గ్రామాల్లో మహిళ సంఘాల, కుల సంఘాల కమ్యూనిటీ భవనాలకు, నెక్కొండలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరి చేసిన నిధులతో పనులు వెంటనే ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ జాటోతు రమేశ్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు కారింగుల సురేశ్, హరికిషన్, గాదె భద్రయ్య, సారంగపాణి, సాంబయ్య, సోమయ్య, మాదాసు రవి తదితరులు పాల్గొన్నారు.

కొనసా..గుతున్న కేజీబీవీ భవన నిర్మాణం

● సంగెంలో రూ.3కోట్ల 25లక్షలతో పనులు



కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సాగుతున్న భవన నిర్మాణ పనులు

సంగెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో భవన నిర్మాణ పనులు కొన సా గు తు న్నా యి. సుమారు రూ.3కోట్ల 25 లక్షల ఖర్చుతో నిర్మిస్తున్న భవన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ విద్య సంవత్సరంలో విద్యార్థులకు వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్దేశించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా పనులు పూర్తికావడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో 15 గదుల నిర్మాణం చేసేందుకు ప్రణాళికలను తయారు చేసిన అధికారులు ఒక్కో ఫ్లోర్‌లో 5 గదుల నిర్మాణ పనులు చేపట్టారు. ఇక్కడ నిర్మిస్తున్న గదుల్లో ఇంటర్ వరకు తరగతి గదుల్లో బోధన చేసే విధంగా రూపకల్పన చేశారు. ప్రస్తుతం పాత ఇరుకు గదుల్లో విద్య బోధనతో పాటు బాలికలు నివాసం ఉండేందుకు వాడుతున్నారు. విద్యార్థినుల సంఖ్య పెరగడంతో ఇరుకు గదులు ఉండడంతో ఒకే చోట వంట, బోధన, వసతులు ఉండటంతో పలు ఇబ్బందులు పడుతున్నారు. బాలికలు భోజనం చేసేందుకు ప్రత్యేక గది లేకపోవడంతో వసారాల్లో భోజనం చేస్తున్నారు. ఉపాధ్యాయులకు సైతం ప్రత్యేక గదులు లేకపోవడంతో ఇరుకు గదుల్లో కాలం వెల్లదీస్తున్నారు. ఇప్పటికైన అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రహదారిపై చెట్లను తొలగిస్తున్న రైతులు



రైతులు తొలగించిన చెట్లు

వర్ధన్నపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని జగ్గుపేట సమీపంలో వ్యవసాయ క్షేత్రాలకు సమీపంలో ఉన్న చెట్లను రైతులు తొలగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలను నాటాలని, వాటిని పరిరక్షించి భావితరాలకు అందించాలని ప్రకటనలు చేశారు. దీంతో గతంలో నాటిన మొక్కలు భారీ వృక్షలుగా ఎదిగాయి. వాటి నీడ పంటలపై పడి పైరు ఎదగడం లేదని, తారు రోడ్డు వరకు సాగు చేసుకోవచ్చనే ఉద్దేశంతో రైతులు పోటీపడి రోడ్డు వెంబడి ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. చెట్లను తొలగించడాన్ని నిరోదించాల్సిన అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని వన ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీటీ రోడ్లతో తీరనున్న రవాణా ఇబ్బందులు

● నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



గురిజాలలోని లోలెవల్ వంతెన వద్ద బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీటీ రోడ్ల నిర్మా ణాలతో ప్రజలకు రవాణా ఇబ్బందులు తొలగిపోతాయని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలం లోని గురిజాల గ్రామ లోలెవల్ వంతెన వద్ద రూ.3 కోట్ల 20 లక్షల వ్యయంతో నిర్మంచనున్న వంతెన నిర్మాణానికి, రూ.3కోట్ల 10 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మె ల్యే శంకుస్థాపన చేశారు. అలాగే నేషనల్ హైవే-365 రోడ్డు నుంచి అడ్డ బాటతండా వరకు రూ.1కోటి, ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి చింతగడ్డతండాకు రూ.60లక్షలు, ఇటుకాలపల్లి జాతీయ రహదారి నుంచి మేడపల్లి వరకు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం రాష్ట్రం పాటుపడుతున్నదన్నారు. నూతన బీటీ రోడ్ల నిర్మా ణాలతో ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొండాపురంలో గౌడ సంఘం కమిటీ ఎన్నిక

రాయపర్తి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపురంలో గౌడ సంఘం కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తేరాల సదానందం, ఉపాధ్యక్షుడిగా జక్కుల కుమారస్వామి, కార్యదర్శిగా మేడి కుమారస్వామి, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని మాజీ సర్పంచ్ ఎనగందుల మురళి ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో పీస్సింటి సోమేశ్వర్ రావు, కుమారస్వామి, ఫున్నం బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లేగ దూడల మృతి

పర్వతగిరి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు లేగ దూడల మృతి చెందాయి. బాధిత రైతు కొమురయ్య కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొట్ల కొమురయ్యకు చెందిన లేగ దూడలు గురువారం మేత మేస్తుండగా పొలంలోని విద్యుత్ స్తంభానికి తాకడంతో విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో లేగ దూడలు మృతి చెందాయని రైతు కొమురయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

కోనాపురంలో బీరన్న బోనాల పండుగ

చెన్నారావుపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనాపురం గ్రామంలో బీరన్న బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసం సందర్భంగా కురుమ, గొల్ల కులస్థుల ఆరాధ్యదైవమైనా బీరన్నకు ప్రత్యేకంగా చేసిన బోనాలను డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకవచ్చి బీరన్న దేవాలయంలో స్వామి వారికి బోనాలను సమర్పించారు. భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కోరే ప్రభాకర్, వీరస్వామి, యూత్ అధ్యక్షుడు ఈర నవీన్, ఉపాధ్యక్షుడు పోతరాజు రాజు, సురేష్, హరీష్, అనిల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

పర్వతగిరి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని పర్వతగిరి సొసైటీ బ్యాంకు చైర్మన్ మనోజ్‌గౌడ్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మండల ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్‌లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతులను, మహిళలను, యువకులను, పెన్షనర్లను మోసం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ను గ్రామాల్లో ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లక్ష్మీనారాయణ, బుద్దా వెంకన్న, మాజీ జడ్పీటీసీ పంతులు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు షబ్బీర్, రాపోలు యాకయ్య, బుర్ర యాకయ్య, మహ్మద్ పాషా, అబ్బాస్, గౌస్, ఇస్మాయిల్, సాబీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గీసుగొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన పొగాకు ఎల్లమ్మ ఇటీవల అనా రోగ్యంతో మృతిచెందింది. కాగా, మృతురాలి కుటుం బాన్ని స్థానిక నాయకులు పరామర్శించి సామాజిక వేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి పంపించిన రూ.5 వేలను గురువారం అందించారు. అదేవిధంగా మేకల మరియాకు బైపాస్ హార్ట్ సర్జరీ కాగా, ఆమెను పరామర్శించి రూ.5వేలను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్, రడం భరత్ మాజీ సర్పంచ్‌లు కోల కుమారస్వామి, మేకల యాకూబ్, నాయకులు భిక్షపతి, కిష్టయ్య, సునీల్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విధిగా ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ చేయాలి

గీసుగొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రోజు ఫేస్ రికగ్నైజ్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్)ద్వారా అన్ని పాఠశాలల్లో విద్యార్థుల అటెం డెన్స్ విధిగాచేయాలని ఎంఈవో సాంబయ్య అన్నారు. గురువా రం వంచనగిరి మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికల హాస్టల్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరిగిన రేట్ల ప్రకారం ఆయా పాఠశాలల హెచ్ ఎంలు మధ్యాహ్న భోజన బిల్లులు చేసి ఎమ్మార్సీకి పంపించాలని సూచించారు. వంట ఏజెన్సీ వారు పరిశుభ్రంగా మెనూ ప్రకారం వంటలు చేసి రుచికరంగా విద్యార్థులకు భోజనాన్ని అందించాలన్నారు. ఉల్లాస్ ఎన్‌రోల్‌మెంట్‌ను త్వరితంగా సీఆర్పీలు పూర్తిచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ ఇన్‌చార్జీ హిమబిందు, కేర్‌టేకర్ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపులో నగదు, మద్యం చోరీ

పర్వతగిరి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగల్ గ్రామం రాజన్న మద్యం షాపులో జరిగిన చోరీలో నగదు, మద్యం ఎత్తుకెళ్లిన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లబెల్లి గ్రామానికి చెందిన మెరుగు రఘుపతి ఏనుగల్‌లో రాజన్న వైన్స్ నడుపుతున్నారు. రోజు మాదిరిగా బుధవారం రాత్రి మద్యం షాపు బంద్ చేసి ఇంటికి వెళ్లారు.

బుధవారం అర్ధరాత్రి 1.30 నుంచి 2 గంటల మధ్య గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి షాపులో ప్రవేశించి నగదు రూ.51వేలు, రూ.33,400 విలువగల మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం యధావిధిగా మద్యం షాపు తెరిసేందుకు వచ్చిన రఘుపతికి దొంగలు పడ్డట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

యూరియా కోసం రైతుల అగచాట్లు

సంగెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సంగెం సొసైటీలో యూరియా కోసం రైతులు అగచాట్లు పడ్డా రు. గురువారం సొసైటీ గోదాం వద్దకు యూరియా వచ్చింద న్న విషయం తెలుసుకున్న సొసైటీ పరిధిలోని గాంధీనగర్, సంగెం, కుంటపల్లి తదితర గ్రామాల రైతులు తరలివచ్చారు. యూరియా కోసం రైతులు ఎగబడడంతో సొసైటీ అధికారులు యూరియా కొరత మూలంగా ఒక్కొక్కరికి రెండు బస్తాలు ఇవ్వడంతో రైతులు నిరాశ చెందారు. ఎరువుల కోసం రైతులు ట్రాక్టర్లు, టాటాఏసీల వాహనాల్లో తరలిరావడం సొసైటీ అవ రణలో కనిపించింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి యూరియా కొరతను తీర్చాలని రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేస్తేసహించం

వర్ధన్నపేట, జూలై 3(ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మరుపట్ల అరుణ సాయికుమార్ హెచ్చరించారు. గురువారం వర్ధన్నపేటలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే నాగ రాజు అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తుంటే ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ లాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మహిళలను కోటీశ్వర్లుగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నల్లబెల్లి, జులై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామలో బీఆర్ఎస్ నాయకుడు కానుగంటి సుమన్ తండ్రి సమ్మయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల నాయకులు బానోతు సారంగపాణి, చెట్టుపల్లి మురళీధర్‌లు గురువారం గ్రామానికి చేరుకొని మృతుడికి పూలమాల వేసి, అంతిమ యాత్రలో పాల్గొన్ని ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నాయకులు గండు శ్రీధర్, జంగిలి వెంకట్రాజు, అడ్డా రాజు, కొమ్ము రాజు, లింగమూర్తి, భిక్షపతి, శంకర్, శ్యాం తదితరులు ఉన్నారు.

7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలి

దుగ్గొండి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించాలని, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సంస్థాగత నిర్మాణంలో భాగంగా 31వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుపు కోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ పోరాటంలో భాగంగా పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణలో సంక్షేమ పథకాలను అన్ని వర్గాల వారికి చెందేవిధంగా సాధించామన్నారు. మన పోరాటాలను ప్రజలకు తెలుపుతూ జెండాలు ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మామునూరి శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రెల బాబు, కొలగాని రవి, బొట్ల ప్రతాప్, పర్లపెల్లి యుగేందర్, కమలాకర్, గణేశ్, రమేశ్, ప్రశాంత్, అఖిల్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను మరిచింది

● బీఆర్ఎస్ నాయకులు

వర్ధన్నపేట రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిందని బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ చింతల యాదగిరి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామిలు ఆరోపించారు. గురువారం మండలంలోని దమ్మన్నపేట, చెన్నారం గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో కాంగ్రెస్ తప్పిదాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కేసీఆర్ చేసిన పనులే గ్రామాల్లో కనిపిస్తున్నాయని గుర్తు చేయాలన్నారు. దివ్యాంగులకు, వృద్ధులకు, ఇతరులకు పెన్షన్ పెంచి ఇస్తామని చెప్పి విస్మరించిన విషయాన్ని బలంగా తీసుకుపోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట చేస్తున్న మోసాలను ఎండగట్టాలని తెలిపారు. మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి గ్రామాలకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. నిధులు లేక గ్రామ పంచాయతీలు విలవిలలాడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశాల్లో మాజీ ఎంపీపీ అప్పారావు, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మాజీ ఆత్మ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, చొప్పరి సోమయ్య, అర్జుల తిరుపతిరెడ్డి, దుగ్యాల మాధవరావు, సిలివేరు కుమారస్వామి, పెంచాల కుమారస్వామి, చొప్పరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న విద్యా సంస్థలు

నర్సంపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : విద్యా హక్కు చట్టాన్ని ప్రైవేటు విద్యా సంస్థలు ఉల్లంఘిస్తున్నా విద్యాశాధికారులు పట్టించుకోవడం లేదని ఏఐఎఫ్‌డిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజు అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ అధికారికి గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు విద్యా సంస్థలు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయడమే కాకుండా పుస్తకాలను అమ్ముతున్నా పట్టించుకోవడం లేదనారు. తక్షణమే ప్రైవేటు పాఠశాలల యజామాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్య క్రమంలో కల్లెపల్లి రాకేశ్ పాల్గొన్నారు.